## విద్యార్థినికి మాజీ మంత్రి సన్మానం



విద్యార్థినిని శాలువాతో సన్మానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, మే 15 : ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిని గురువారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శాలువాతో సన్మానించి అభినందించారు. వనపర్తి మండలం కిష్టగిరి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఆంజనేయులు కుమార్తె ఎం.నవ్య నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఊర్కొండపేట ఎంజేబీ స్కూల్‌లో చదువుతూ 557మార్కులు సాధించినట్లు చెప్పారు. లక్ష్యాన్ని నిర్ణయించుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని మాజీ మంత్రి ఆకాంక్షించారు. అంతకు ముందు దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శారద అశోక్, బండారు సుజాత కృష్ణ, నర్సింహ, రాజు, శివ గౌడ్, లక్ష్మణ్ గౌడ్, బాబునాయక్, ధర్మనాయక్, వెంకటయ్య, కొండయ్య, చిట్యాల రాము, అంజి తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

రేవల్లి, మే 15 : మండలంలోని తల్పునూర్ గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరక్టర్ సురేశ్ తండ్రి రాములు (75) వారం రోజుల కిందట అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ కురుమ తిరుపతిరెడ్డి, నాయకులు శివరాం రెడ్డి, రాంచంద్రయ్య, నిరంజన్ రెడ్డి, రమేశ్, ఎండీ అల్తాఫ్ ఉన్నారు.

## అందాల రాశులపై ఉన్న శ్రద్ధ ధాన్యపు రాశులపై లేదు

- బీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య



ధాన్యపు రాశులను పరిశీలిస్తున్న కుర్వ పల్లయ్య

గద్వాల అర్బన్, మే 15 : రేవంత్‌రెడ్డి సర్కార్‌కు అందాల రాశులపై ఉన్న శ్రద్ధ రైతుల పండించిన ధాన్యపు రాశులపై ఆవగింజంత కూడా లేదని బీఆర్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ ఆరోపించారు. మండలంలోని వెంకంపేట ధాన్యం కొను గోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి చూడటానికి వస్తున్న అందాల రాశులకు వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఇస్తున్న ప్రభుత్వం మరి ఆరుగాలం కష్టపడి పండించిన పంట కోసం ధాన్యం కొను గోలు కేంద్రాల వద్ద పడికాపులు కాస్తున్నా రైతులకు ఎవరు రక్షణగా ఉంటారని ప్రశ్నించారు. అకాల వర్షాలకు రైతుల ధాన్యం తడిసిపోతుంటే రైతులను ఆదుకోవాల్సింది పోయి రైతులను గాలికొదిలేశారని విమర్శించారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అలంపుర్, మే 15 : ప్రకృతి వ్యవసాయం చేయడంతో కలిగే మంచి ఫలితాల గురించి రైతులకు మండల వ్యవసా యాధికారి నాగార్జున రెడ్డి వివరించారు. గురువారం అలంపూర్ మండలం బుక్కాపురం, లింగనవాయి క్లస్టర్లలోని రైతులకు జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ పథకంపై ఆయన అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తిగల రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని, పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ప్రకృతి వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణ, అవగాహన కల్పించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు నీలిమ, శిరీష, రైతులు పాల్గొన్నారు.

## పట్టణ ప్రజలకు వైద్య పరీక్షలు



అయిజలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అయిజ, మే 15 : పట్టణంలోని ప్రజలకు జాతీయ వ్యాధి నియంత్రణ (ఎన్‌సీడీ) కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఏఎన్ఎం ప్రమీల అన్నారు. గురువారం పట్టణంలోని మడ్డిగుంత కాలనీ ప్రజలకు పీహెచ్‌సీ సిబ్బంది బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. వానకాలం ప్రారంభమవుతున్న వేళ దోమల బెడద నుంచి ఏ విధంగా రక్షణ పొందాలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు లక్ష్మిదేవి, సుజాత, జ్యోతి పాల్గొన్నారు.

## ప్రతిభా విద్యార్థికి సన్మానం



చెలిమి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని సన్మానిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్, మే 15 : జిల్లా కేంద్రానికి చెందిన కోట్ల శ్యామల, భీముడు కుమారుడు కోట్ల హర్షవర్ధన్ రెడ్డి ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 528మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారు. గురువారం ప్రతిభా విద్యార్థిని వారి స్వగృహంలో చెలిమి సంస్థ అధ్యక్షుడు సిద్ధు రవి ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి అభినందించారు. ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రులకు, ప్రాంతానికి మంచి పేరు తేవాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో కవి పండితుడు గిరిరాజాచారి, చెలిమి సంస్థ సభ్యులు చెన్నకేశవులు, గోవిందు, కుర్మయ్య ఉన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు

- కలెక్టర్ సంతోష్, ఎస్పీ తోట శ్రీనివాస రావు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

గద్వాల అర్బన్, మే 15 : జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర చర్యలు తీసుకుంటూ అధికారులు పూర్తి నిబద్ధతతో బాధ్యతా యుతంగా పనిచేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఎస్పీ తోట శ్రీనివాస రావుతో కలిసి కలెక్టర్ రోడ్డు భద్రతా జిల్లా కమిటీ సమావేశంలో వివిధ శాఖల అధికారులతో రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలకు అస్కారం లేకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బీచుపల్లి నుంచి పుల్లూరు జంక్షన్ వరకు ప్రమాద ప్రాంతాలకు బ్లాక్ స్పాట్‌గా గుర్తించి వాటిపై సోమవారం నాటికి పోలీస్, జాతీయ రహదారుల అధికారులు ప్రమాద నివారణ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎర్రవల్లి నుంచి గద్వాల వరకు ప్రమాద సూచిక బోర్డులు, హెచ్చరికలు గుర్తులు, కల్వర్టులు మరమ్మతులు చేయాలని అర్‌అండ్‌బీ శాఖను ఆదేశించారు. గద్వాల నుంచి రాయిచూర్ మార్గంలో ఉన్న స్పీడ్ బ్రేకర్లు ఎత్తుగా ఉండటంతో ప్రమాదాలకు అవకాశమున్నదని, వాటిని సవరించాలని, వాహనదారులకు భద్రతతోపాటు సౌలభ్యం కలిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద వాహనదారులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు సమతలంగా ఉండేలా, పరిసరాలను శుభ్రంగా ఉంచుతూ మంచి వాతావరణం కల్పించాలన్నారు. అవసరం మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరుప యోగంగా ఉన్న సీసీ కెమెరాల మరమ్మతులు చేపట్టాలన్నారు. సమీక్షలో డీఎస్పీ మొగిలయ్య, అర్‌అండ్‌బీ ఈఈ ప్రగతి, పంచాయతీరాజ్ పీఆర్ దామోదర్ రావు, జిల్లా రవాణా అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సిద్ధప్ప, అధికారులు ఉన్నారు.

## అన్నదాతలు అధైర్యపడొద్దు

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- సింగిల్ విండో కొనుగోలు కేంద్రం ప్రారంభం



వీపనగండ్లలో సింగిల్ విండో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ వెంటేశ్వర్లు

వీపనగండ్ల, మే15 : పాన్‌గల్, వీపనగండ్ల మండలాల్లో వరి కోతలు ఆలస్యం కావడం వల్ల 30శాతం వరకు మాత్రమే కొనుగోలు చేశామని వారం రోజుల్లోగా పూర్తిస్థాయిలో ధాన్యం కొను గోలు చేస్తామని రైతులు అధైర్యప డాల్సిన అవసరం లేదని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేస్తూ.. రెండు రోజుల కిందట మండల కేంద్రంలో రైతులు నిర్వహించిన రాస్తారోకోకు స్పందనగా.. మండలకేంద్రంలో తూంకుంట సింగిల్‌విండో సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా లో 379 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 71 రైస్ మిల్లులు, 11 బాయిల్డ్ మిల్లులకు ధాన్యాన్ని సరఫరా చేసినట్లు తెలిపారు. జిల్లాలో పాన్‌గల్, వీపనగండ్ల, పెబ్బేరు, శ్రీరంగా పుర్, వనపర్తి, పెద్దమందడి మండలాల్లో ఎక్కువ శాతం వరిసాగు చేశారన్నారు. జిల్లాలో కొత్తకోట, మదనాపురం, ఆత్మకూర్, అమరచింత మండలాల్లో 80 శాతం వరకు ధాన్యాన్ని కొనుగోలు చేశారన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని పెబ్బేరు సమీపంలోని మార్కెట్ గోదాంకు తరలించాలని వరలక్ష్మి, ఏపీఎం బుచ్చన్నకు సూచించారు. అంతకు ముందు పాన్‌గల్ మార్కెట్ యార్డును తనిఖీ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహిళా సమైక్య అధ్యక్షురాలు ఎత్తం చిట్టెమ్మ రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ధాన్యం తరలింపులో లారీల సమస్య లేకుండా చూసుకోవాలి

వనపర్తి టౌన్, మే 15 : ధాన్య కొను గోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపులో లారీల సమస్యలు లేకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం ఆయన చాంబర్‌లో డీఎస్పీ, జిల్లా రోడ్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసర్, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల సంస్థ, డీఆర్‌డీవో, జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్లతో ధాన్యం తరలింపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం రైతుల నుంచి కొను గోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లతో మాట్లాడి సెంటర్‌కు లారీలను పెట్టాలన్నారు. ధాన్యం తరలింపులో లారీల సమస్య లేకుండా చూసుకోవాలని, లేక పోతే కాంటాక్ట్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా అదనపు లారీలను ఏర్పాటు చేయాలని రోడ్ ట్రాన్స్ పోర్ట్ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా లారీలు పెట్టడానికి ఇబ్బంది కలిగిస్తే డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

- ఇద్దరికి తీవ్రగాయాలు



తిమ్మమ్మ (ఫైల్)

ఎర్రవల్లి చౌరస్తా, మే 15 : గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన ఎర్రవల్లి మండలం ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై వెంకటేశ్ కథనం మేరకు అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన హుస్సేన్ రెడ్డి తన భార్య తిమ్మమ్మ అలియాస్ సరిత (30), కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి తన చెల్లెలు ఇంటికి బైక్‌పై వనపర్తి జిల్లా గంగవరం గ్రామానికి బయలుదేరారు. మార్గం మధ్యలో ఇటిక్యాల మండలం జింకలపల్లి గ్రామం శివారు వద్ద ఉదయం 5 గంటల సమయంలో గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో తిమ్మమ్మ ఘటనా స్థలంలోనే మృతి చెందింది. భర్త హుస్సేన్‌రెడ్డి, జగన్ మోహన్ రెడ్డికి తీవ్రగాయాలు కాగా కర్నూల్ దవాఖానకు అంబులెన్స్‌లో తరలించారు. మృతురాలి అన్న దేవేందర్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### బావిలోపడి వ్యక్తి ..

ఎర్రవల్లి చౌరస్తా, మే 15 : ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఇటిక్యాల మండలం కోదండాపూర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్సై మురళి కథనం మేరకు వనపర్తి జిల్లా రెవల్లి మండలం కొంకలపల్లి గ్రామానికి చెందిన శేషయ్య(56) బుధవారం కోదంపూర్ గ్రామానికి వెళ్లాడు. శేషయ్య కోదండాపూర్ గ్రామానికి చెందిన నాగేంద్ర, రాముడు తో కలిసి వేముల గ్రామ శివారు వద్ద బావి వద్దకు ఈత కోసం వెళ్లి, ప్రమాదశాత్తు బావిలో పడి మట్టిపుడికలో కాలు ఇరుక్కొని బావిలో మునిగిపోయాడు. గురువారం ఉదయం 8గంటల ప్రాంతంలో శేషయ్య మృతదేహం లభించింది. మృతుడి కుమారుడు రాంభూపాల్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అలంపూర్, మే 15 : ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తులు అనుమతులు లేకుండా అలంపూర్ మండలంలోని సింగవరం గ్రామ శివారులో రాత్రిళ్లు తుంగభద్రా నదిలోని ఇసుకను తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు అలంపూర్ శిక్షణ ఎస్సై కుమార్ సిబ్బందితో కలిసి నదిలోకి వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన ఇసుక మాఫియా కొంతమంది ట్రాక్టర్లతో పారిపోగా ఒక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు డ్రైవర్ ఎవరని విచారిస్తున్నామని శిక్షణ ఎస్సై పేర్కొన్నారు. ఇసుక అక్రమంగా తరలింపునకు పాల్పడిన ట్రాక్టర్‌యజమానిపై కేసు నమోదు చేసినట్లు శిక్షణ ఎస్సై తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

### గద్వాలలో కొంకలపల్లి వాసి మృతి

రేవల్లి, మే 15 : గద్వాలలో కొంకలపల్లి వాసి మృతి చెందాడు. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని కొంకలపల్లి గ్రామానికి చెందిన శేషయ్య (50) బుధవారం గద్వాల మండలం కోదండా పురంలో జరిగే జములమ్మ గ్రామ దేవత ఉత్సవాల్లో పాల్గొనేందుకు గ్రామస్తులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లాడు. ఉత్సవాల అనంతరం అతడు వెంట వచ్చిన వారితో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు గ్రామ సమీపంలోని బావి వద్దకు వెళ్లాడు. బావిలో దూకిన అతడు నీటిలో మునిగి ఎంతకీ పైకి రాకపోవడంతో, అతడి వెంట ఉన్న వారు నీళ్లల్లో వెతికారు. బావి నీళ్లతో నిండుగా ఉండడంతో అతడి ఆచూకీ లభించక పోవడంతో, నీటిని మోటరు సహాయంతో బయటకు తోడారు. బావిలో శేషయ్య అప్పటికే మృతిచెంది శవమై కనిపించాడు. మృతదేహాన్ని గురువారం కొంకలపల్లికి తరలించి అంత్యక్రియలు నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడి భార్య కొంత కాలం కిందట మృతి చెందగా, కూతురు, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

## అందాల పోటీలను ప్రతిఘటించాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద

గట్టు, మే 15 : మహిళల ఆత్మగౌరవాన్ని భంగపరిచే అందాల పోటీలను ప్రతిఘటించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఐద్వా కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ మహిళలపై హత్యలు, లైంగిక దాడులు పెరిగిపోతుంటే అరికట్టాల్సిన ప్రభుత్వం దీన్ని వదిలి అందాల పోటీలను నిర్వహించడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. మన మహిళలతో ప్రపంచ అందగత్తెల పోటీదారుల కాళ్లు కడిగించి టవల్స్‌తో తుడిపించడం బానిసత్వాన్ని గుర్తుచేస్తోందని ఎద్దేవా చేశారు. మహిళలతోపాటు యువతుల అన్నిరంగాల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాల్సిందిపోయి ఈ విధంగా ప్రభుత్వం ప్రవర్తించడం అమానుషమని విమర్శించారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు జయమ్మ, రాధ, గోవిందమ్మ, నర్సమ్మ, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలి



చెన్నారం రైతు వేదికలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో కరుణశ్రీ

గోపాల్‌పేట, మే 15 : రైతులు వ్యవసాయ అధికారుల సూచనల మేరకు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని ఏవో కరుణశ్రీ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏదుల మండలంలోని చెన్నారం రైతువేదికలో గురువారం 'రైతు ముంగిట్లో– శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, అగ్రికల్చర్ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ వరి తగ్గించి తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఆరుతడి పంటలు సాగు చేయాలని కోరారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు రసాయణ ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. భూసార పరీక్షలు చేయించాలన్నారు. హార్టికల్చర్ ఏడీ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ..రైతులు ఉద్యానవన పంటలైన ఆయిల్‌పాం వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు మాధురి, మహేశ్వరమ్మ అగ్రికల్చర్ విదార్థులు, రైతులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



శాంతినగర్‌లో సమ్మెపోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

రాజోళి, మే 15 : ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కేవీపీఎస్ నాయకుడు విజయ్‌కుమార్ గురువారం పిలుపునిచ్చారు. సమ్మెలో భాగంగా 20వ తేదీన కార్మిక సంఘాల నాయకులు, పారిశుద్య కార్మికులు విధులకు హాజరుకారని ఎంపీడీవో ఖాజ, పంచాయతీ కార్యదర్శి కృష్ణయ్యకు ఆ సంఘం నాయకుడు దస్తగిరి ఆధ్వర్యంలో నోటీసులు ఇచ్చారు. కార్యక్రమంలో విజయ్, లక్ష్మన్న, సత్తార్, మహేశ్ పాల్గొన్నారు.

### వడ్డేపల్లి మండలంలో..

వడ్డేపల్లి, మే 15 : ఈనెల 20న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పరం జ్యోతి ఆధ్వర్యంలో శాంతినగర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో సీఐటీయూ నాయకులు, కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మికుడు దావీదు, ఆటో యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు



ట్రాక్టర్లలో ఆయిల్ పాం గెలలు

వడ్డేపల్లి, మే 15 : వడ్డేపల్లి, రాజోళి మండలాల్లోని గ్రామాల్లో అన్నదాతలు ఆయిల్‌పాం సాగుచేసి అధిక దిగుబడులను సాధిస్తున్నారు. ప్రస్తుతం నాలుగో ఏడాదిలో గెలలను ఉత్పత్తి చేస్తున్నాయని అధికారులు తెలిపారు. నౌరోజి క్యాంపు, మాన్ దొడ్డి గ్రామాలకు చెందిన రైతులు మొదటి దఫా కోతను ఇప్పటికే ప్రారంభించగా 43టన్నుల దిగుబడి వచ్చినట్లు వెల్లడించారు. మొదటి దశ కోతలో పెద్ద మొత్తంలో దిగుబడి రావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రెండు మండలాల్లో కలిపి 800ఎకరాలపైగా సాగు చేయగా ప్రస్తుతం పెద్ద మొత్తంలో సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. బీచుపల్లి దగ్గరలోని ఆయిల్ పాం కర్మాగారం త్వరలో ప్రారంభమవుతుండటంతో రైతులకు భరోసా ఏర్పడుతుందని రైతు లు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయిల్ పాం టన్ను ధర రూ. 20,600 పై మాటే ఉందని, దిగుబడి బాగా ఉందని రైతులు కృష్ణమూర్తి, శ్రీలక్ష్మి, సత్యనారాయణ, ప్రసాద్, వెంకటనారాయణ, నాగేశ్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సాగుపై ఫీల్డ్ ఆఫీసర్ యశ్వంత్ తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు.

## సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

వనపర్తి టౌన్, మే 15 : కాళేశ్వరి త్రివేణి సంగమంలో ఈనెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతీ పుష్కరాలకు వనపర్తి డిపో నుంచి డిలక్స్, సూపర్ లగ్జరీ ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ గురువారం ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సుకు రూ.2,320, డీలక్స్‌కు రూ.2,040 రానుపోను చార్జీలను నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఆసక్తి గల భక్తులు బస్సు బుక్ చేసుకోవచ్చని డీఎం తెలిపారు.

## క్షణికావేశ నిర్ణయాలు సరైనవి కావు

గద్వాలటౌన్, మే 15 : ఉద్రిక్తత, ఒత్తిడి, కోపంలో తీసుకునే క్షణికావేశ నిర్ణయాలు సరైనవి కావని, ఈ నిర్ణయాల కారణంగా సమాజానికి చెడు సందేశాన్ని పంపిన వారమవుతామని కోర్సు డైరెక్టర్ వెంకటనర్సయ్య సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో గురువారం కెపాసిటీ బిల్డింగ్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. సాక్షి ఒన్ స్టాప్ సెంటర్ అందించే సేవలను వివరించారు. మహిళల హక్కులు తమ హక్కులను సాధించే దిశగా కృషి చేయాలన్నారు. బాలికలు విద్యలో రాణించడంతో స్వయం నియంత్రణతో నడిచేందుకు శక్తిని పొందుతారని చెప్పారు. పూర్తి అవగాహనతో నిర్ణయాలు తీసుకోవాలని అప్పుడే చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో సాక్షి ఓఎస్‌సీ ఇన్‌చార్జి శోభారాణి, కేస్ వర్కర్ స్వాతి, ఐటీ స్టాఫ్ జుబేర్ పాల్గొన్నారు.

## కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, మే 15 : 2025-26 విద్యా సంవత్సరానికి గానూ కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి గురువారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగుల విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. మార్చి 2025 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై, సీజీపీఏ 7.0/400 మార్కులు పైగా సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. కార్పొరేట్ కళాశాలలో ప్రవేశానికి ప్రభుత్వ, జిల్లా పరిషత్, రెసిడెన్షియల్, తెలంగాణ ఆదర్శ పాఠశాలలు, ఎయిడెడ్, నవోదయ, కస్తూర్బాగాంధీ, బెస్ట్ అవైలెబుల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు మాత్రమే అర్హులని చెప్పారు. విద్యార్థులు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా తమ పేర్లను తక్షణమే నమోదు చేసుకోవాలని తెలిపారు. జూన్ 5న సెలక్షన్ లిస్ట్, 10వ తేదీన ఎంపికైన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన, కళాశాలల అలాట్‌మెంట్ ఆర్డర్ అందజేస్తారని తెలిపారు. అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## 17న మెగా జాబ్ మేళా

గద్వాల అర్బన్, మే 15 : నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈనెల 17వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ సత్యనారాయణ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో శనివారం ఉదయం 10గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో నిరుద్యోగ యువత పాల్గొని ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 9110523925, 8341441 763 నెంబర్లు సంప్రందించాలన్నారు.

## కేతేపల్లి గ్రామవాసికి డాక్టరేట్



హైదరాబాద్‌లో పీహెచ్‌డీ పట్టాను అందుకున్న వెంకటేశ్‌గౌడ్

పాన్‌గల్, మే 15 : పాన్‌గల్ మండలం కేతేపల్లి గ్రామానికి చెందిన వర్ధన్‌గౌడ్, కృష్ణమ్మ దంపతుల కుమారుడు వెంకటేశ్‌గౌడ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వృక్షశాస్త్రంలో డ్రాగన్‌ఫ్రూట్ యొక్క శాఖీయ ప్రత్యుత్పత్తి, ప్రథమ, ద్వితీయ జీవక్రియలు, జన్యు వైవిధ్యంపై ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టా పొందారు. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాలో పీఎంఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈసందర్భంగా పీహెచ్‌డీ పట్టా పొందిన వెంకటేశ్ గౌడ్‌ను గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గోపాల్‌పేట, మే 15 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన ఘటన బుద్ధారం గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు మండలంలోని బుద్ధారంలో కొంత కాలంగా గుర్తు తెలియని వ్యక్తి ఉంటున్నాడు. గ్రామంలో అన్నం అడుక్కొని తింటూ రాత్రి బస్టాండ్‌లో పడుకుంటున్నాడు. ఇది ఇలా ఉండగా, గురువారం ఉదయం రోడ్డు దాటుతుండగా, గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు 108 కు సమాచారం అందించి చికిత్స కోసం వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

### పురుగుల మందు తాగి వ్యక్తి మృతి

వడ్డేపల్లి, మే 15 : పురుగుల మందు తాగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై నాగశేఖర్ రెడ్డి కథనం ప్రకారం కొంకల గ్రామానికి చెందిన బసన్న కుమారుడు కుర్వ ఈరన్న(32) బుధవారం రాత్రి కడుపు నొప్పి భరించలేక జూలేకల్ శివారులోని ఓ పొలంలో పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు. మృతుడు నాలుగేండ్లుగా కడుపునొప్పితో బాధపడేవాడని నొప్పి భరించలేక పురుగుల మందు తాగాడని భార్య ఫిర్యాదులో పేర్కొందని ఎస్సై తెలిపారు.